సాక్షి చిత్తూరు

సోమవారం ¦ 8 ¦ సెప్టెంబర్ ¦ 2025



తిరుపతి సైన్స్ సెంటర్‌లో సందడి



ఆలయ 'గ్రహణం'



శ్రీకాళహస్తి ఆలయంలో భక్తులు





కాణిపాకం, పెంచలకోన ఆలయాల తలుపులు మూసివేస్తున్న అధికారులు

సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఆదివారం జిల్లాలోని ఆలయాలు మూతపడ్డాయి. రాత్రి 9.57 నుంచి గ్రహణ సమయం మొదలవుతున్న నేపథ్యంలో మధ్యాహ్నం నుంచే ఆలయాలను మూసివేశారు. ఈ క్రమంలోనే తిరుమల, తిరుపతి, కాణిపాకం, పెంచలకోన, బోయకొండ, మొగిలిలో సంప్రదాయబద్ధంగా మహద్వారాలు మూతపడ్డాయి. అయితే రాహుకేతు క్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదిదంపతులకు శాంతి అభిషేకం నిర్వహించారు. గ్రహణ సమయం ముగిసిన తర్వాత ఆలయాలను శుద్ధి చేశారు. సంప్రోక్షణ, పుణ్యాహవచనం తర్వాత భక్తులను యథావిధిగా దర్శనానికి అనుమతించారు.

– తిరుమల/శ్రీకాళహస్తి/కాణిపాకం/రాపూరు





మూతపడిన తిరుమల శ్రీవారి ఆలయ మహాద్వారం

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో 'గ్రీవెన్స్'

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అర్జీలు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలని ఆదేశించారు. గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోలీస్ కార్యాలయంలో..

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని వన్‌టౌన్ పక్కన ఉన్న ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ తెలిపారు. ప్రజలు వారి సమస్యలను నేరుగా తనను కలిసి తెలియజేయవచ్చని సూచించారు. ఉదయం 10.30 గంటల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు.

బస్సుల్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు



తనిఖీ చేస్తున్న పోలీసులు

గుడిపాల : తమిళనాడుకు వెళుతున్న బస్సులను ఆదివారం గుడిపాల పోలీసుల సహకారంతో తిరుపతి ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఓ బస్సులో ప్రయాణిస్తున్న ఇద్దరు ఎర్రచందనం కూలీలను అదుపులోకి తీసుకున్నారు.అనంతరం విచారణ నిమిత్తం కూలీలను తిరుపతికి తరలించారు.

ఎంపీడీఓలకు ఉద్యోగోన్నతి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని పలువురు ఎంపీడీఓలకు డీడీఓలుగా ఉద్యోగోన్నతి లభించింది. రాష్ట్ర వ్యాప్తంగా 46 మంది ఎంపీడీఓలను డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు(డీడీఓ)గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా ఐరాల ఎంపీడీఓ ధనలక్ష్మిని డ్వామా ఏపీఓ (ఎంఅండ్ఈ)చిత్తూరు, నెల్లూరు డ్వామా ఏపీఓ(ఎంఅండ్ఈ) ఎం.ధనలక్ష్మిని డ్వామా పలమనేరు, తిరుపతి ఎంపీడీఓ రామచంద్రను డీడీఓ పలమనేరు, వైఎస్సార్ జిల్లా సంపేపల్లె ఎంపీడీఓ ఎస్.రామచంద్రను కుప్పం డీడీఓగా నియమించారు. శ్రీకాళహస్తి వెటర్నరీ ఆఫీసర్ అమర్‌నాథ్‌ను అక్కడే కొనసాగించేలా ఆదేశాల్లో పేర్కొన్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట దివ్యాంగుల ధర్నా

చిత్తూరు కలెక్టరేట్ : దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు దివ్యాంగుల జేఏసీ నేతలు కొణతం చంద్రశేఖర్, మురళి వెల్లడించారు. ఆదివారం వారు మాట్లాడుతూ త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన దివ్యాంగుల్లో ఒక్కొక్కరికి రూ.1.07 లక్షల విలువ చేసే మూడు చక్రాల స్కూటర్ పంపిణీ చేయనున్నారన్నారు. ఇందులో వైకల్య శాతం 70 శాతం కంటే ఎక్కువ ఉంటేనే స్కూటర్ అందిస్తామని నిబంధన విధించడం సరికాదన్నారు. సదరం సర్టిఫికెట్ల రీవెరిఫికేషన్‌లో చాలా మంది దివ్యాంగుల వైకల్యశాతం తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే అక్టోబర్‌లో పంపిణీ చేసే పింఛన్లపై సైతం స్పష్టత లేదన్నారు. ఈ క్రమంలోనే కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగనున్నట్లు వివరించారు. జిల్లాలోని దివ్యాంగులు ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్ వద్దకు రావాలని పిలుపునిచ్చారు.



కేవీబీ పురం మండలంలో వరి ధాన్యాన్ని నిలవసానికి తరలిస్తున్న రైతులు

ధాన్యం.. దైన్యం



ధాన్యం పరిస్థితి దయనీయంగా మారింది. గిట్టుబాటు ధర లేక కల్లాల్లోనే మిగిలిపోయింది. కొనుగోలు చేసేవారి కోసం పడిగాపులు కాస్తోంది. ప్రభుత్వ సహకారం లేకపోవడంతో దిక్కుతోచక కొట్టుమిట్టాడుతోంది. పండించిన రైతుకు చేయూతనందించే అవకాశం లేక దిగాలుపడుతోంది. పైగా వ్యాపారులు సిండికేట్‌గా మారి సాగు చేసిన అన్నదాతను దగా చేస్తుంటే కుమిలిపోతోంది. ఆరుగాల కష్టం దళారుల పాలవుతుంటే దైన్యంగా విలపిస్తోంది. గతంలో బస్తా రూ.2,200 పలకడంతో గర్వంగా తల ఎగరేసిన రోజులను గుర్తు చేసుకుంటోంది. ప్రస్తుతం బస్తా రూ.1,200లకే పడిపోవడంపై కన్నీరుమున్నీరవుతోంది. పాలకులు స్పందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి దేశానికి వెన్నెముకను నిలబెట్టాలని కోరుతోంది.



తొట్టంబేడు మండలం లింగమనాయుడుపల్లెకి చెందిన గంధం రామకృష్ణయ్య తనకున్న 2.70 ఎకరాల్లో వరి పంట సాగు చేశాడు. ఈయన కూడా ఎకరాకు రూ.25వేలకు పైనే ఖర్చు చేశాడు. అదునుకు యూరియా దొరక్కపోవడంతో పంట దిగుబడి తగ్గింది. వ్యాపారులు బస్తా రూ.1,200 అడుగుతుండటంతో ఇలా రోడ్డుపై ధాన్యాన్ని ఉంచుకుని గిట్టుబాటు ధర కోసం ఎదురు చూస్తున్నాడు.



చిట్టమూరు మండలం ఆరూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు తనకున్న 2.10 ఎకరాల్లో వరి సాగు చేశాడు. 68 బస్తాల దిగుబడి వచ్చింది. గిట్టుబాటు ధర కోసం ఎదురుచూసి చేసిన అప్పులకు వడ్డీ కట్టలేక పుట్టి రూ.15 వేలకు అమ్మేశాడు. గత ప్రభుత్వ హయాంలో ఇదే పుట్టి వరి ధాన్యం రూ.19 వేలకు అమ్మినట్లు శ్రీనివాసులు చెబుతున్నాడు.

- గతంలో బస్తా రూ.2,200.. నేడు రూ.1,200
- గిట్టుబాటు ధరలేక కల్లాల్లోనే ధాన్యం
- కొనుగోలు కేంద్రాలు కరువు.. ఎగుమతులకు అనుమతి లేదు
- సిండికేట్‌గా మారిన వ్యాపారులు, మిల్లర్లు, దళారులు
- రైతు అవసరాలే అదునుగా తక్కువ ధరకే కొనుగోళ్లు
- ఇదెక్కడి దారుణమంటూ.. ఆవేదనలో అన్నదాతలు

సాక్షి ప్రతినిధి, తిరుపతి : వరికి గిట్టుబాటు ధర లేక అన్నదాతలు అల్లాడిపోతున్నారు. పెట్టిన పెట్టుబడి చేతికి రాకపోవడంతో అప్పుల పాలవుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో తిరుపతి, చిత్తూరు జిల్లాలో 86 వేల ఎకరాల్లో వరి పంట సాగైంది. సాధారణ సాగు విస్తీర్ణంలో 15 శాతం తక్కువ వరి పంట వేశారు. ప్రస్తుతం 50 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. మరో వారం పది రోజుల్లో 50 శాతం వరి కోతలు పూర్తవుతాయి. కోతలు పూర్తయిన వారికి ఎకరానికి 25 నుంచి 30 బస్తాలు దిగుబడి సాధించారు. కొనబోతే కొరివి, అమ్మబోతే అడవి అన్నచందంగా వరి ధాన్యం కొనుగోలు చేయటానికి వ్యాపారులు ముందుకు రావడం లేదు. వచ్చినా తక్కువ ధరకు అడుగుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

దళారుల ఇష్టారాజ్యం

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకే వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని రైతులు ఎదురుచూశారు. అయితే ఇప్పటి వరకు ఎక్కడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం, వరి ఎగుమతులకు ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడంతో దళారులు, వ్యాపారుల ఇష్టారాజ్యంగా మారింది. అంతా సిండికేట్‌గా మారి బస్తా రూ.1,200 నిర్ణయించారు. వరి కోతలు పూర్తయిన రైతులు అనేక మంది ఆ ధరకు విక్రయిస్తే గిట్టుబాటు కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరి కొద్ది రోజులు వేచి చూద్దామని రైతులు కొందరు కల్లాల్లో ధాన్యాన్ని కుప్పలు పోసుకుని మద్దతు ధర కోసం ఎదురుచూస్తున్నారు. మరి కొందరు కూట్లు ద్వారా నిల్వచేసుకున్నారు.

వరిపంట కొనుగోలే లేదు



వాకాడు మండలం కోడివాకలో కూటు కట్టి ధాన్యం నిల్వ చేసుకుంటున్న రైతులు

పుంగనూరు : పుంగనూరులో వరిపంట కొనుగోలుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఖరీఫ్ పంట పండించిన రైతులు వరి ధాన్యాన్ని తమకు నచ్చిన రీతిలో క్వింటా రూ.2,200 లతో విక్రయాలు చేసుకున్నారు. కాగా పుంగనూరు నియోజకవర్గంలోని పుంగనూరు, చౌడేపల్లె, సోమల , సదుం, రొంపిచెర్లం, పులిచెర్ల మండలాలతో పాటు పంజాణి, గంగవరం మండలాల్లో సుమారు 5,200 హెక్టార్లలో సాగు చేశారు. ప్రస్తుతం రబీ సాగు 2.50 హెక్టార్లలో మాత్రమే సాగు అవుతోంది. ఈ సారైన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందా లేదా అన్నది చూడాలి.

జగన్ ప్రభుత్వంలోనే వరికి గిట్టుబాటు ధర



జగన్ ప్రభుత్వంలోనే వరికి గిట్టు బాటు ధర ఉండేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో గిట్టు బాటు ధర లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో బస్తా(76 కేజీలు) వడ్లు రూ.2,300 నుంచి రూ.2,600 వరకు పలికింది. ఇప్పుడు రూ.1,300 నుంచి రూ.1,600 వరకు ఉంది. ఎకరాకు పెట్టుబడి రూ.25 వేలకు పైనే ఖర్చవుతోంది. గిట్టుబాటు ధరలేక ఇబ్బందిగా ఉంది.

సీ.హరినాథ్, రైతు, మతుకువారిపల్లె, పులిచెర్ల మండలం

వడమాలపేట చెందిన మునికృష్ణయ్య తనకున్న రెండెకరాల పొలంలో రూ.54 వేలు అప్పుచేసి వరి సాగు చేశాడు. ఇటీవలే వరి కోత కోశారు. ఎకరానికి 25 బస్తాల చొప్పున వచ్చింది. 50 బస్తాలు దిగుబడిలో నుంచి 10 బస్తాలు ఇంటి అవసరాలకు ఉంచుకున్నాడు. మిగిలిన 40 బస్తాల వరి ధాన్యాన్ని విక్రయించి అప్పు తీర్చేయొచ్చని ఆశగా ఎదురుచూశాడు. వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేవారు కరువయ్యారు. చేసేది లేక వ్యాపారులను వెళ్లి కలిశాడు. బస్తా రూ.1,200 చొప్పున ఇస్తే కొనుగోలు చేస్తామని చెప్పారు. చేసేది లేక వ్యాపారి అడిగిన ధరకే విక్రయించాడు. 75 కిలోల బస్తా అయితే.. తేమ ఉందని చెప్పి అదనంగా 6 కిలోల చొప్పున వేసుకున్నాడు. 81 కిలోల బస్తా రూ.1,200 చొప్పున విక్రయించాల్సి వచ్చిందని రైతు బోరుమన్నాడు.

అయినకాడికి అమ్మేసుకుంటున్న రైతులు



కర్రల కాటాలతో తూకం వేస్తున్న వ్యాపారులు

వడ్డీలు భరించలేక కొందరు, అత్యవసర పరిస్థితుల్లో మరి కొందరు రైతులు వ్యాపారులు అడిగిన ధరకే విక్రయించి నష్టపోతున్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దళారులు, వ్యాపారులు అందిన కాడికి దోచుకునేపనిలో పడ్డారు. వరిలో తేమ ఉందని చెప్పి 6 కిలోలు అదనంగా దండుకుంటున్నారు. మరి కొందరు కర్రలతో కాటా ఏర్పాటు చేసి రాళ్లు, గుండ్లు పెట్టి ధాన్యాన్ని తూకాలు వేసుకుని అన్నదాతలను మరింత మోసం చేస్తున్నారు. కర్రల కాట, రాళ్లు పెట్టి తూకాలు వేస్తే మరో రెండు, మూడు కిలోల ధాన్యం నష్టపోతున్నారు. వ్యాపారులు బస్తా రూ.1,200 కొనుగోలు చేసి మిల్లర్లకు రూ.1,800 చొప్పున విక్రయించి సొమ్ముచేసుకుంటున్నారు.



మిల్లుకు తరలుతున్న ధాన్యం

పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు :



అనేక కష్టాలు పడి యాజమాన్య పద్ధతులను పాటించి పంట పండించా. ఇంత చేసినా మద్దతు ధర లేదు. తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తోంది. కనీసం ఎరువులు, దున్నకాలకు పెట్టిన పెట్టుబడులు కూడా రాలేదు. బస్తా 83 కిలోలు తూకం వేసుకున్నారు. ఇలా చేయడం వల్ల పది బస్తాలకు 30 కిలోలు నష్టపోతున్నాం.

– చిరంజీవి, చౌడేపల్లి, వెదురుకుప్పం మండలం

గతంలో గిట్టుబాటు ధర ఉండేది



గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి లేదు. 110 రోజులు కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధరలేదు. గత ప్రభుత్వ హయాంలో బస్తా రూ.1,800 నుంచి రూ.2,200 వరకు ధర పలికింది. ఇప్పుడు ఇచ్చే ధర కోత, ఎరువుల ఖర్చులకు కూడా చాలదు. యూరియా దొరక్క తీవ్ర ఇబ్బంది పడాల్సి వచ్చింది.

– మధుసూదన్‌రెడ్డి, శ్రీకాళహస్తి మండలం

ధర లేక ఇంట్లోనే మగ్గుతున్నాయ్



పండించిన వడ్లకు గిట్టుబాటు ధరలేక ఇంట్లోనే మగ్గుతున్నాయ్. బస్తా వడ్లు రూ.1700 ధర ఉంది. ఎకరా వరి పంట సాగు చేశా. 35 బస్తాల వడ్లు దిగుబడి వచ్చింది. పంట సాగుకు రూ.40 వేలు పెట్టుబడి పెట్టా. వడ్లకు ధర లేకపోవడంతో ఇంట్లోనే మగ్గుతున్నాయి. గిట్టుబాటు ధర లేదని వరి పంట సాగు చేయడం నిలిపి వేశా. ఇప్పుడు భూమికి లీజుకు తీసుకుని బొప్పాయి సాగు చేస్తున్న . ప్రభుత్వం పంటలకు గిట్టుబాటు కల్పించాలి.

– రైతు చంద్రారెడ్డి. రెడ్డివారిపల్లె, రొంపిచెర్ల మండలం

అనుమతులు రాలేదు



ఖరీఫ్ సీజన్‌లో వరి ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం నుంచి అనుమతులు ఏమీ రాలేదు. దాంతో కొనుగోలు చేయలేదు. ఇప్పటికే 90 శాతం వరి ధాన్యం ఒబ్బిళ్లు పూర్తయ్యాయి. రబీలో మాత్రమే కొనుగోలు చేశాం. ఖరీఫ్‌లో 80వేల ఎకరాల్లో వరి పంట సాగుచేస్తే.. అందులో 60 వేల ఎకరాలకు పైగా ఎంటీయూ 1010 సాగుచేశారు. తర్వాత కేఎస్ఎం, ఏడీటీ 37 రకాలు సాగుచేశారు. డిమాండ్ రకాలపై అవగాహన కల్పిస్తున్నాం.

–ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, తిరుపతి

నివేదికలు పంపించాం

వరి ధ్యానం కొనుగోలు ప్రస్తుతానికి లేదు. శనివారం రైతు భరోసా, వరి సాగు వివరాలు రాష్ట్ర స్థాయి అధికారులు అడిగారు. ఆ వివరాలు పంపించాం. త్వరలో ఆ వివరాలు వెల్లడిస్తాం. గిట్టుబాటు ధర, ఇతరాత్ర వివరాలు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జరుగుతాయి.

–లక్ష్మి, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్, చిత్తూరు


'ఎద్దల బండ'పై గద్దలు!

కూటమి ప్రభుత్వంలో పచ్చమూక రెచ్చిపోతోంది. ప్రకృతి వనరులను యథేచ్ఛగా దోచుకుంటోంది. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు అన్నట్టు ఇష్టారాజ్యంగా అక్రమార్జనకు పాల్పడుతోంది. అందులో భాగంగానే బందార్లపల్లె సమీపంలోని ఎద్దల బండపై కన్నేసింది. కొండను పగులగొట్టి కాసులు పోగేసుకునేందుకు రంగం సిద్ధం చేసింది. అధికారుల అండతో క్వారీ నడిపేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ క్రమంలోనే స్థానికుల అడ్డుతొలగించుకునేందుకు దాడులకు పాల్పడుతోంది. పోలీసులను సైతం ఉసిగొల్పి భయభ్రాంతులకు గురిచేస్తోంది.

- క్వారీ నడిపేందుకు టీడీపీ నేతల సన్నాహాలు
- అనుమతులు మంజూరు చేసిన అధికారులు
- ఊరు నాశనమవుతుందంటున్న బందార్లపల్లె వాసులు
- పొలాలు.. ఇళ్లు ధ్వంసమవుతాయని ఆవేదన



క్వారీకి అనుమతి ఇచ్చిన ఎద్దల బండ



బండ సమీపంలో సాగు భూములు

వెదురుకుప్పం : మండలంలోని కొమనగుంట పంచాయతీ బందార్లపల్లె గ్రామానికి సమీపంలో ఎద్దల బండ ఉంది. సుమారు 7 ఎకరాల విస్తీర్ణంలోని ఈ కొండపై క్వారీ నడిపేందుకు టీడీపీ నేతలు యుగంధర్‌నాయుడు, తదితరులు సన్నాహాలు సాగిస్తున్నాడు. అధికారులను మామూళ్ల మత్తులో జోకొట్టి అనుమతులు సైతం తీసేసుకున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఆ ప్రాంతంలో క్వారీ ప్రారంభమైతే సమీపంలోని తమ పంట పొలాలు నాశనమవుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

ఎద్దల బండపై క్వారీ నడిపితే పేలుళ్ల కారణంగా వచ్చే దుమ్ముధూళితో వాతావరణ కలుషితమవుతుందని బందార్లపల్లె వాసులు ఆందోళన చెందుతున్నారు. పొలాల్లో దుమ్ము పేరుకుపోయి పంటలు పండే ఆస్కారం ఉండదని వాపోతున్నారు. వాయుకాలుష్యం కారణంగా దీర్ఘకాలిక రోగాలు ప్రబలే ప్రమాదం పొంచి ఉందని ఆరోపిస్తున్నారు. అలాగే క్వారీ పేలుళ్లతో గ్రామంపై రాళ్లు పడి స్థానికుల ప్రాణాలకే ముప్పు వాటిల్లే దుస్థితి దాపురిస్తుందని మండిపడుతున్నారు. పేలుళ్ల శబ్దాలకు ఇళ్లు సైతం బీటలువారే ప్రమాదముందని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. స్వచ్ఛమైన గాలితో ప్రశాంతంగా తమ గ్రామం ఉంటుందని, క్వారీ కారణంగా పూర్తిగా నాశనమవుతుందని వాపోతున్నారు.

పట్టించుకోని అధికారులు

సుమారు రెండు నెలలుగా క్వారీ విషయం గందరగోళంగా మారినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. తాంబూలం ఇచ్చేశాం.. తన్నుకు చావండి అన్నట్టు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. క్వారీకి అనుమతులు మంజూరు చేసి నిమ్మకు నీరెత్తినట్లు కూర్చున్నారని ఆరోపిస్తున్నారు. ఇదే అదునుగా సదరు క్వారీ యజమాని సుమారు 20 మంది రౌడీలను తీసుకువచ్చి తమపై దాడి చేయించినా స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చివరకు పోలీసులు కూడా అక్రమార్కులకే వంతపాడుతున్నారని, కేసులు పెడతామని బెదిరిస్తున్నారని

అడ్డు పడితే అంతే..

బందార్లపల్లె వాసుల సమస్యలను గుర్తించకుండా కేవలం ధన దాహంతో క్వారీ యజమాని పనులు చేపడుతున్నాడు. క్వారీ కారణంగా తలెత్తే అనర్థాలను పక్కన పెట్టి ఎలాగైనా బండను కొల్లగొట్టేందుకే అభ్యంతరాలను ఖాతరు చేయడం లేదు. అధికారులను గుప్పిట్లో పెట్టుకుని గ్రామస్తులను బెదిరింపులకు గురిచేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గూండాలను సైతం రంగంలోకి దింపి దాడులకు పాల్పడుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఇది మా ప్రభుత్వం.. మా ఎమ్మెల్యే.. ఇక్కడ అధికారం మాది అంటూ ముప్పతిప్పలు పెడుతున్నాడని ఆవేదన చెందుతున్నారు.


ఊరొదిలి వెళ్లాల్సిందే..



ఎద్దల బండపై క్వారీ మొదలైతే అందరం ఊరొదిలి వెళ్లిపోవాల్సిందే. ఇళ్లు, పొలాలు నాశనమవుతాయి. ప్రాణాంతక వ్యాధులు చుట్టుముడతాయి. మేత కరువై పశువుల పెంపకం కష్టతరంగా మారుతుంది. ఇప్పుడు ఎద్దల బండపై పంట నూర్పిళ్లు కూడా చేసుకుంటున్నాం. టీడీపీ నేతలు మా కష్టాలను గమనించి కనికరించాలి.

– జయంత్ రెడ్డి, బందార్లపల్లె

బీడు పెట్టుకోవాల్సిందే..



ఎద్దలబండపై క్వారీ నిర్వహిస్తే సమీపంలోని 20 ఎకరాలను బీడు పెట్టుకోవాల్సిందే. భూములు సాగుకు పనికిరాకుండా పోతాయి. క్వారీ వద్దని అభ్యంతరం చెబితే మహిళలని కూడా చూడడం లేదు. విచక్షణా రహితంగా దాడి చేస్తున్నారు. రైతులకు అండగా నిలవాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు.

– ధనలక్ష్మి, బందార్లపల్లె

పోలీస్ యాక్టు దుర్వినియోగం

శాంతిపురం : శాంతి భద్రతల పరిరక్షణకు ఉద్దేశించిన 30 పోలీస్ యాక్టును రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కె.కోదండరెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన మాట్లాడుతుః పోలీసుల తో విపక్షాన్ని అణచివేసే కుట్రలో భాగంగా ఈ చట్టాన్ని ఏడాది పొడవునా అమలు చేస్తున్నా రని ఆక్షేపించారు. కుప్పం పోలీసు డివిజన్ పరిధిలో ప్రతి నెలా యాక్టును పొడిగిస్తూ విపక్ష కార్యక్రమాలను కట్టడి చేసేందుకు యత్నిస్తున్నా రని మండిపడ్డారు. పార్టీ కార్యక్రమాలకు పోలీసులు అనుమతులు ఇవ్వడం లేదని, ఒక వేళ మంజూరు చేసినా సవాలక్ష నిబంధనలు, పరిమితులు విధిస్తున్నారని మండిపడ్డారు. కుప్పం నియోజకవర్గ పోలీసులు అధికార పార్టీ విషయంలో మాత్రం చట్టాన్ని మినహాయిస్తున్నార ని విమర్శించారు. అధికార, విపక్షాలకు పోలీసులు వేర్వేరు చట్టాలను అమలు చేస్తున్నారని ఆరోపించారు. పోలీసుల ద్వంద వైఖరి, 1861 నాటి 30 పోలీస్ యాక్టుకు వ్యతిరేకంగా త్వరలోనే న్యాయపోరాటానికి దిగనున్నట్లు వెల్లడించారు.

క్లుప్తంగా

ఏనుగుల స్వైర విహారం



మూలమడుగులో ఏనుగు

పులిచెర్ల(కల్లూరు) : మండలంలోని పాతపేట, పాపిరెడ్డిగారిపల్లె పంచాయతీల్లో ఆదివారం వేకువజామున ఏనుగులు స్వైరవిహారం చేశాయి. పంట పొలాలను నాశనం చేశాయి. వేరుశనగ, అరటి, మామిడితోటల్లో బీభత్సం సృష్టించాయి. అనంతరం మంగళంపేట సమీపంలోని మూలమడుగులో సేదతీరాయి. ఈ క్రమంలో రాత్రివేళ మళ్లీ పొలాలపై పడే ప్రమాదముందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగులను దారి మళ్లించాలని కోరుతున్నారు.

నేటి నుంచి లాసెట్ అడ్మిషన్ల ప్రక్రియ షురూ

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ ఆధ్వర్యంలో జరిగిన ఏపీ లాసెట్ మూడు, ఐదు సంవత్సరాల ప్రక్రియకు ఎట్టకేలకు నోటిఫికేషన్ విడుదలైంది. సోమవారం నుంచి 11వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరగనుంది. ఈనెల 12వ తేదీ నుంచి 14 వతేదీ వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. 15న వెబ్ ఆప్షన్ల మార్పునకు అవకాశం కల్పిస్తూ 17వ తేదీన సీట్ల కేటాయింపు చేయనున్నారు. అలాగే బీఈడీ కోర్సులకు సైతం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఉన్నత విద్యామండలి ఆదేశాలు జారీ చేసింది.

వేడుకగా విశ్వరూప పాదయాత్ర



అనుగ్రహ భాషణం చేస్తున్న శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ

తిరుపతి కల్చరల్: కంచి కామకోటి పీఠాధిపతులు శంకర విజయేంద్ర సరస్వతి స్వామి, సత్యచంద్ర సరస్వతి స్వామివార్ల విశ్వావసు నామ సంవత్సరం చాతుర్మాష్య దీక్ష విరమణ సందర్భంగా కంచి మఠ స్వామీజీల ఆధ్వర్యంలో మఠ భక్తులు ఆదివారం సాయంత్రం నగరంలో విశ్వరూప యాత్ర వేడుకగా చేపట్టారు. కంచి మఠం మహాపాదుకా మండపం నుంచి దివ్యారామం ఉద్యానవనం వరకు ఈ విశ్వరూప పాదయాత్ర సాగింది. అనంతరం అక్కడ కంచి మఠాధిపతులు శ్రీభగవద్గీతలోని విశ్వరూప దర్శన యోగ అధ్యాయనాన్ని పఠించారు. అనంతరం స్వామివారు భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణ చేశారు. కార్యక్రమంలో రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం ఉపకులపతి జీఎస్ఆర్ కృష్ణమూర్తి, ఎస్వీ వేదిక్ యూనివర్సిటీ ఉపకులపతి రాణి సదాశివమూర్తి, నగరంలోని పలువురు ప్రముఖులు, మఠం ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

మదమెక్కిన భీ'కరి'!

కౌండిన్య అడవిలో సంచరించే మదపుటేనుగులు (ఫైల్)





కౌండిన్య పరిధిలోని మొత్తం ఏనుగులు : సుమారు 100
ఇప్పటి వరకు గజ దాడుల్లో మృతుల సంఖ్య : 15
గాయపడినవారు : 36
ఇప్పటిదాకా మృతి చెందిన ఏనుగుల సంఖ్య : 19

కౌండిన్య అభయారణ్యంలో ఏనుగుల సమస్య ఇప్పట్లో తీరేలా లేదు. మదపుటేనుగుల మేటింగ్ సీజన్ మొదలు కావడంతో జనానికి ముప్పు తప్పేలాలేదు. అక్టోబర్ నుంచి జనవరి వరకు మదమెక్కిన గజరాజులకు పట్టపగ్గాలే ఉండవు. అలవి కాని ఆగ్రహంతో రెచ్చిపోయే భీ'కరి' నుంచి తోటి జంతువులతోపాటు మనుషులకు కూడా ముప్పు పొంచి ఉంటుంది. మేటింగ్ సీజన్ ముగిసే వరకు అటవీ సమీప ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముంది. ఎలిఫెంట్ శాంచురీని దాటి బయటకొచ్చే మదపుటేనుగుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది.

- అక్టోబర్ నుంచి జనవరి వరకు ఏనుగులకు మేటింగ్ సీజన్
- ఉద్రేకంతో రెచ్చిపోతున్న గజరాజులు
- ఇప్పటికే జనంపై పలు ప్రాంతాల్లో దాడులు

పలమనేరు : కుప్పం, చిత్తూరు, పలమనేరు ఫారెస్ట్ రేంజ్‌ల పరిధిలోని కౌండిన్య అభయారణ్యంలో ఏనుగులతోపాటు అటు తమిళనాడులోని మోర్ధన ప్రాంతం, కృష్ణగిరి, కావేరిపట్నం , కర్ణాటకలోని హోసూర్, బన్నేర్‌గట్టల నుంచి తరచుగా కౌండిన్యలోకి ప్రవేశించే ఏనుగులున్నాయి. స్థానికంగా ఉన్న గుంపుల్లో మొత్తం 12 మగ ఏనుగులుండేవి. వీటిలో ఆరు మృతిచెందగా ఇప్పుడు ఆరు మగ ఏనుగులు (మదపుటేనుగులు) మాత్రం ఉన్నాయి. గుంపు నుంచి విడిపోయి ఒంటరిగా సంచరిస్తున్నాయి. ఒక్కో మదపుటేనుగు ఎంపిక చేసుకున్న ప్రాంతంలోనే ఎక్కువగా ఉంటుంది. ఇవి చాలా క్రూరంగా ప్రవర్తిస్తుంటాయి. జనం కనిపిస్తే దాడులు చేయడం, లేదా తరమడం చేస్తుంటాయి. వీటి చేష్టలు, గుర్తులను బట్టి స్థానికంగా వాటికి పేర్లు పెట్టి పిలుస్తుంటారు. ఈ ప్రాంతంలో రౌడీ ఏనుగు, రాముడు, భీముడు, ఒంటి దంతం ఏనుగు, ఒంటి కన్ను ఏనుగు ఇలా వీటికి పేర్లు పెట్టారు. ఇవి తమ ఉనికి కోసం రౌడీల్లా ప్రవర్తిస్తుంటాయి. మిగిలిన ఆడ ఏనుగులు, గున్నలకు భయమెక్కువ, దీంతో ఇవి గుంపులోనే ఉంటూ జనాన్ని చూసి వెనక్కు వెళుతుంటాయి. కానీమదపుటేనుగులు ఏమాత్రం భయపడవు, ఎదురు దాడులకు దిగుతుంటాయి.

ప్రస్తుతం ఆరు మాత్రమే..

కౌండిన్యలోని 12 మదపుటేనుగుల్లో ప్రస్తుతం ఆరు మాత్రమే ఉన్నాయి. బంగారుపాళెం మండలం మొగిలివారిపల్లెలో రౌడీ ఏనుగుగా చెప్పుకునే మదపుటేనుగు కరెంటు తీగలకు బలైంది. గంగవరం మండలం మన్నారునాయనిపల్లె సమీపంలో పొలానికి రక్షణగా ఏర్పాటు చేసిన కరెంటుకు మరో మదపుటేనుగు బలైంది. అంతకుముందు కాలువపల్లె, మొసలి మడుగు వద్ద రాముడు, భీముడు అనే రెండు మదపుటేనుగులు చనిపోయాయి. మూడేళ్ల క్రితం పలమనేరు మండలంలోని బేరుపల్లె, గాంధీనగర్‌ల వద్ద రెండు మదపుటేనుగులు కరెంట్ షాక్‌తో కన్నుమూశాయి. ఇవి బతికున్నప్పుడు మనుషులు, పశువులు, కుక్కలను తరమి తరమి చంపేవి. ఇప్పుడున్న ఆరు మదపుటేనుగుల్లో గుడ్డి కన్ను ఏనుగు గత మేటింగ్ సీజన్‌లో యాదమరి మండలం దిగువకనతల చెరవువద్ద అటవీశాఖ డ్రైవర్ సతీష్‌ను చంపిన విషయం తెలిసిందే. మొసలిమడుగు రౌడీగా పిలవబడే మరో ఏనుగు కౌండిన్యలోని వీరమానికుంటవద్ద ఫారెస్ట్ సిబ్బందిపై దాడి చేసి ఆపై ముగ్గురు ఎలిఫెంట్ ట్రాకర్స్‌ను తొండంతో విసిరేసింది.

ఊసరపెంట మదపుటేనుగు తరచూ ఆ గ్రామంలోకి వచ్చి రాత్రంతా ఉండి వెళ్లడం దీని ప్రత్యేకత. మిగిలిన రెండు మదపుటేనుగులు వేర్వేరుగా కౌండిన్యలో సంబంధిత ప్రాంతాల్లో సంచరిస్తుంటాయి.

ఆగ్రహంతో ఊగిపోతూ...

మదపుటేనుగులపై జనం రాళ్లు విసరడం, టపాకాయలను పేల్చడం, టైర్లు కాల్చి వాటి పైకి విసరడం లాంటి చర్యలతో మగ ఏనుగులు జనంపై కసి పెంచుకున్నాయి. ఆడ ఏనుగులుకున్నంత సహనం వీటికి ఉండదు. ఇప్పటిదాకా పరిశీలిస్తే యాదమరి మండలం దిగువకనతల చెరువువద్ద అటవీశాఖ డ్రైవర్ సతీష్‌ను, వీరమానికుంటవద్ద ఫారెస్ట్ సిబ్బందిపై దాడి చేసి ఆపై ముగ్గురు ఎలిఫెంట్ ట్రాకర్స్‌ను తొండంతో విసరడం, పందేరుపల్లి వద్ద రైతును, కాలువపల్లి వద్ద యువకుడిని తొండంతో కొట్టి చంపడం చేసింది మదపుటేనుగులే. పెద్దపంజాణిమండలం పెనుగొలకలకు చెందిన బంగారప్పను, కాలువపల్లి వద్ద రైతు సుబ్రమణ్యను చంపింది మదపుటేనుగులే. కుప్పంలోనూ దాడులు చేసింది ఇవే. పదిరోజుల క్రితం పెద్దపంజాణి మండలంలో రైతును తొక్కి చంపిందే మదపుటేనుగే. గుడిపాల మండలంలో దంపతులను చంపిందే మదపుటేనుగే.



ఏనుగుల ఉనికిని పసిగట్టి రక్షణకోసం చెట్లపై ఏర్పాటు చేసుకున్న అటక(ఫైల్)



మదపుటేనుగుల జాడకోసం నిత్యం శ్రమించే ఎలిఫెంట్ ట్రాకర్లు

ఈ నాలుగునెలలు ప్రమాదమే..

ముఖ్యంగా మదపుటేనుగులు అక్టోబరు నుంచి జనవరి వరకు ఆడ ఏనుగుల సాంగత్యం కోసం మత్తులో ఉంటాయి (మేటింగ్ సీజన్). దీంతో తిక్కతిక్కగా ప్రవర్తించడం, మనుషులను చూస్తే ఆగ్రహంతో ఊగిపోతుంటాయి. తన పరిధితోపాటు అడవిలో ఆడ ఏనుగుల కోసం చాలాదూరం అన్వేషిస్తుంటాయని అటవీశాఖ అధికారులు తెలిపారు. ఈ సమయంలో మనషులు, జంతువులపై దాడులు ఎక్కువగా ఉంటాయి. ఆడ ఏనుగులు వీటి మాట వినకపోవడం లేదా అక్కడ జరిగే రభసతో ఇప్పటిదాకా ఆరు ఆడ ఏనుగులు మృతిచెందాయి. ఏదేమైనా ఈ నాలుగునెలలు మదపుటేనుగుల కారణంగా ప్రమాదాలు పొంచిఉన్నాయి. కాబట్టి అడవుల్లోకి ఎవరూ వెళ్లకూడదని ఫారెస్ట్ అధికారులు సూచిస్తున్నారు.

మదపుటేనుగులకు కోపం ఎక్కువ



గుంపులనుంచి వేరుగా ఉంటూ ఒంటరిగా సంచరించే మదపుటేనుగులు చాలా కోపంగా ఉంటాయి. వీటి బారినుంచి తప్పించుకోవాలంటే ఏనుగు తరిమినప్పుడు మనిషి నేరుగా కాకుండా ఎస్ ఆకారంలో వెళ్లాలి. ఒంటిపై ఉన్న బట్టలను తీసి ఏనుగు ముందు వేస్తే అది కాసేపు దాన్ని వాసన చూస్తు తొక్కుతుండగా ఆ గ్యాప్‌లో తప్పించునే అవకాశముంటుంది. మేటింగ్ సీజన్‌లో మరింత ఆగ్రహంగా ఉంటాయి. కాబట్టి అటవీ సమీప గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. – భరణి, డీఎఫ్‌ఆర్‌ఓ, చిత్తూరు

అక్రమ కేసులకు భయపడం



మాట్లాడుతున్న నారాయణస్వామి

కార్వేటినగరం : కూటమి ప్రభుత్వం బనాయిస్తున్న అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి స్పష్టం చేశారు. ఆదివారం పుత్తూరులోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వానికి పేదలు అవసరం లేదని, పెత్తందారులే ప్రధానమని ఆరోపించారు. అందుకే మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేసిందని మండిపడ్డారు. వైద్య విద్యను పేద విద్యార్థులకు దూరం చేసేందుకే కంకణం కట్టుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగనన్న పాలనలో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఏకంగా 17 మెడికల్ కళాశాలలను తీసుకొచ్చామని వెల్లడించారు. నేడు కేంద్ర ప్రభుత్వం చేతిలో చంద్రబాబు కీలుబొమ్మగా మారారని, వారిని ఎదిరించే దమ్ము, ధైర్యం లేక మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేస్తున్నట్లు ఆరోపించారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా పేద విద్యార్థులపై వివక్ష చూపుతారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రభుత్వమే మద్యం షాపులు నిర్వహిస్తే.. స్కామ్ జరిగిందని, అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. పైసా అవినీతి లేని లిక్కర్ కేసులో దాదాపు 39 మందిని కక్ష పూరితంగా కూటమి ప్రభుత్వం అరెస్టు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రతి గ్రామంలో రెండు నుంచి మూడు బెల్టు షాపులు పెట్టి విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తున్నారని,ఈ ప్రభుత్వంలోనే కుంభకోణం జరుగుతోందని ఆరోపించారు. రాబోయే రోజుల్లో జగనన్న ప్రభుత్వమే వస్తుందని, జనరంజకంగా పాలన ఉంటుందని స్పష్టం చేశారు.

మృతదేహం వెలికితీత



యువన్‌శంకర్ మృతదేహం

కుప్పం రూరల్: మండలంలోని పరమసముద్రం చెరువులో శుక్రవారం గల్లంతైన యువన్‌శంకర్(18) అనే యువకుడి మృతదేహాన్ని ఆదివారం అగ్నిమాపక సిబ్బంది వెలికితీశారు. మూడు రోజులుగా మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టగా ఎట్టకేలకు మృతదేహం లభ్యమైంది. ఈ క్రమంలో చెరువు వద్దకు చేరుకున్న మృతుడి కుటుంబీకుల, బంధుమిత్రుల రోదనలు మిన్నంటాయి. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సాయంత్రం యువన్‌శంకర్‌కు అంత్యక్రియలు నిర్వహించారు.

వరసిద్ధుని వైభవం

కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ప్రత్యేక బ్రహ్మోత్సవాలు నయనానందకరంగా సాగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం ఉదయం మూలవిరాట్‌కు పంచామృత అభిషేకం నిర్వహించారు. ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. రాత్రి ఈ మేరకు రావణబ్రహ్మ వాహనంపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చి వైభవంగా ఊరేగించారు. భక్తులు కర్పూరహారతులతో మొక్కులు చెల్లించుకున్నారు.





అలరించిన నృత్యం

ఆలయంలోని ఆస్థాన మండపంలో నిర్వహించిన కూచిపూడి, భరత నాట్యం అలరించాయి. అలాగే గీతాలపాలనలు భక్తులను హృదయాలను రంజింపజేశాయి. ఈ సందర్భంగా కళాకారులను ఈఓ పెంచలకిషోర్ సత్కరించారు.

నేడు యాళివాహన సేవ

ప్రత్యేక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి యాళివాహన సేవ నిర్వహించనున్నట్లు ఈఓ పెంచల కిషోర్ తెలిపారు.

బోయకొండకు పోటెత్తిన భక్తులు

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ సేవకు భక్తులు ఆదివారం పోటెత్తారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వేకువజాము నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రద్దీ కొనసాగింది. మహిళలు పిండి, నూనె దీపాలు వెలగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈఓ ఏకాంబరం నేతృత్వంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.



భక్తులతో కిక్కిరిసిన క్యూ

అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, కృపాలక్ష్మి

కార్వేటినగరం : అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ ఉంటుందని, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 9వ తేదీన ఆర్‌డీఓ కార్యాలయాల ఎదుట నిరసన చేపడుతున్నామని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. ఆదివారం పుత్తూరులోని తన నివాసంలో అన్నదాత పోరు పోస్టర్ ఆవిష్కరించారు. నారాయణస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎరువుల కొరత తీవ్రంగా ఉందన్నారు. ప్రశ్నించిన వారిపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్నదాతల అవసరాలకు అనుగుణంగా రైతుభరోసా కేంద్రాల్లో ఎరువులను అందించామని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం యూరియా పంపిణీలో సైతం కోతలు విధిస్తోందని విమర్శించారు. మామిడి రైతులకు ఫ్యాక్టరీల ద్వారా రూ.8, ప్రభుత్వం రూ.4 చెల్లిస్తామని చంద్రబాబు ఊదరగొట్టారని, వాస్తవానికి ఫ్యాక్టరీలు రూ.5 మాత్రమే చెల్లించినా పట్టించుకోలేదని మండిపడ్డారు.ఇక ప్రభుత్వం ఇస్తామని చెప్పిన రూ.4లకు అతీగతీ లేకుండా పోయిందన్నారు. వైఎస్సార్‌సీపీ జీడీనెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి మాట్లాడుతూ రైతులను కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఆరోపించారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో పూర్తి వైఫల్యం చెందిందని విమర్శించారు.

అమ్మవారి శిరస్సు చోరీ

– నిందితుల అరెస్ట్



బైక్‌పై పరారవుతున్న నిందితులు

ఐరాల : పురాతనమైన పాలేటమ్మ ఆలయంలో అమ్మవారి శిరస్సును చోరీ చేసిన నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం ఈ మేరకు వివరాలు వెల్లడించారు. ఐరాలకు చెందిన శ్రీరాములు, కురప్పపల్లెకు చెందిన హరి, వైఎస్ గేటుకు చెందిన జయరామ్‌తోపాటు, పాకాల మండలం గానుగపెంటకు చెందిన నీల అనే మహిళ ఆలయంలో పూజలు నిర్వహించే సాకుతో ప్రవేశించారు. ఎవరూ లేని సమయం చూసి అమ్మవారి శిరస్సును అపహరించారు. హరి, శ్రీరాములు ముందుగా అక్కడి నుంచి పరారయ్యారు. శిరస్సు ఉంచిన బ్యాగులో నీల, జయరామ్ ద్విచక్రవాహనంలో చిత్తూరు వైపు వెళ్లిపోయారు. కాసేపటి తర్వాత పూజ చేసేందుకు వచ్చిన భక్తులు అమ్మవారి శిరస్సు కనిపించకపోవడంతోఆలయ వంశపార్యంపర ధర్మకర్త బాలాజీకి సమాచారం అందించారు. ఆయన ఆలయానికి చేరుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు వెంటనే అప్రమత్తమై గాలింపు చర్యలు చేపట్టగా చింతగుప్పలపల్లె వద్ద ద్విచక్రవాహనంలో అమ్మవారి శిరస్సుతో వెళుతున్న జయరామ్, నీల పట్టుబడ్డారు. అనంతరం శ్రీరాములు, హరిని సైతం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చోరీకి ప్రధాన సూత్రధారి శ్రీరాములుగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

పాలేటమ్మ ఆలయంలో చోరీకి గురైన అమ్మవారి శిరస్సు తిరిగి అదే స్థానంలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రోక్షణ, అభిషేకాలు చేపట్టారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలు పకడ్బందీగా నిర్వహించాలి

తిరుపతి క్రైం : తిరుమలలో ఈనెల 24వ తేదీ నుంచి జరగబోయే శ్రీవారి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పేర్కొన్నారు. ఆదివారం పోలీస్ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన అధికారుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతేడాది బ్రహ్మోత్సవాలు విజయవంతంగా నిర్వహించామని ఈసారి కూడా అదే తరహాలో జరగాలని కోరారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ భక్తులకు మెరుగైన సౌకర్యాలను అందించాలన్నారు. ఏదైనా సమస్య వస్తే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమన్వయంతో నిర్ణయం తీసుకోవాలన్నారు. తిరుమలలోని బాలాజీ నగర్‌తో పాటు పాప వినాశనం ప్రాంతాలలో నాకాబందీ నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. ఆటో డ్రైవర్లు, జీపు డ్రైవర్లు భక్తులతో ఏ విధంగా వ్యవహరించాలో అవగాహన కల్పించాలన్నారు. తిరుమలలో పబ్లిక్ అవేర్నెస్ మీటింగ్ నిర్వహించాలని ప్రజలను చైతన్యవంతులుగా చేయాలన్నారు. 400 మంది సిబ్బందితో క్రౌడ్ కంట్రోల్ ఏ విధంగా చేయాలనే దానిపైన అవగాహన కార్యక్రమాన్ని చేపట్టాలని ఆర్మ్‌డ్ అడిషనల్ ఎస్పీకి సూచించారు. మెడికల్ ఎమర్జెన్సీ ఏర్పడినప్పుడు తిరుమలలో ఏ రూట్‌లో వెళ్లాలి.. అనే విషయం ఇప్పటికే నిర్ధారించుకోవాలన్నారు. ఇంటిగ్రేట్ చెక్ పోస్టులు కమాండ్ కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఉత్తమ ప్రతిభకు ఉపకార వేతనం

- నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తులు
- ఈ నెల 30వ తేదీ ఆఖరి గడువు



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : ఉత్తమ ప్రతిభ కనబరచిన పేద విద్యార్థులకు ఉపకార వేతనం అందించేందుకు కేంద్రప్రభుత్వం కార్యాచరణ అమలు చేస్తోంది. నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష ద్వారా అర్హులను ఎంపిక చేస్తోంది. అందులో భాగంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష రాసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ఆదర్శ పాఠశాలల్లోని 8వ తరగతి విద్యార్థులు దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులు. అలాగే సంబంధిత విద్యార్థులు కుటుంబ ఆదాయం రూ.3.5 లక్షల లోపు ఉండాలి.

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

ఈ పరీక్ష రాసేందుకు అర్హత, ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఎంపికైన వారికి ఇంటర్మీడియట్ వరకు ఏటా రూ.12 వేలు చొప్పున స్కాలర్‌షిప్ అందుతుంది. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీలు రూ.50 చొప్పున పరీక్ష ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

కావాల్సినవి ఇవే..

ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తు చేసుకునే సమయంలో విద్యార్థి ఫొటో, సంతకం అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. కుల, ఆదాయ, విద్యా ధ్రువీకరణపత్రాలు ప్రస్తుతం లేకపోయినప్పటికీ పరీక్ష రాసే సమయానికి సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో విద్యార్థులు www.bre.ap.gov.in వెబ్ సైట్‌లో పాఠశాల డీఐఎస్‌ఈ నంబర్‌తో లాగిన్ కావాలి. తర్వాత ఆధార్‌కార్డు మేరకు వివరాలను అప్‌లోడ్ చేయాలి. అనంతరం అదే లాగిన్‌లో ఆన్‌లైన్ లో పరీక్ష ఫీజు చెల్లించాలి.